సీరియల్ కథ

# ప్రేమకు పెళ్ళెప్పుడు?

రచన :
శ్రీ రేగులపాటి కిషన్ రావు.

సాయంత్రం 3 గంటలు కావస్తోంది.

ఎవరో కొత్తవ్యక్తి మెల్లగా నడచివస్తున్నాడు. వీధి అరుగుమీద కూర్చున్న ప్రభాకర్ రావు అతనిని చాలా శ్రద్ధతో చూడసాగాడు. అతడు ధరించిన దుస్తులు బీదరికాన్ని తెలియజేస్తున్నాయి. నడచి నడచి అలసిపోయినట్టు అతని నడక తెలియజేస్తూవుంది. అతని ముఖం అందమైనదే అయినా చెమట పట్టి వుండడం వలన అందంగా కనిపించుటలేదు.

కోమటి కొమురయ్య ఇంటి దక్షిణ భాగాన వేపచెట్టు వుంది. అతడు ఆ చెట్టు నీడవైపే నడుస్తున్నాడు. మరో పదడుగులు నడిస్తే చెట్టు నీడకు చేరేవాడు. కాని హఠాత్తుగా నేలమీద పడిపోయాడు.

ప్రభాకర్ రావు గబగబా అడుగులు వేస్తూ అతని చెంతకు చేరాడు. అతడు స్పృహ తప్పి పడిపోయాడని గ్రహించి కోమటి కొమురయ్య ఇంట్లోకి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి అతని ముఖముపై చల్లాడు.

అప్పటికే కొంతమంది అతని వద్దకు వచ్చి చేరారు.

"ఏమయింది?" ముఖంపై నీళ్ళు చల్లుతున్న ప్రభాకర్ రావును అడిగాడొకతను.

"నడుస్తూ నడుస్తూనే పడిపోయాడు. వడదెబ్బ తగిలినట్టుంది"

"ఎవరితను?" మరో వ్యక్తి ప్రశ్నించాడు ప్రభాకర్ రావును.

"ఏమో! నాకూ తెలియదు" అని క్షణమాగి మళ్ళీ అతడే అన్నాడు.

"పాపం ఎక్కడివాడో ఏమిటో అలా వేపచెట్టు నీడలోకి తీసుకెళ్లాం పట్టండి" నలుగురైదుగురు అతనిని లేవనెత్తి వేపచెట్టు నీడలోకి తెచ్చి పరుండబెట్టారు.

ఈ సంవత్సరం వున్న ఎండలను గురించి, ఎండలవల్ల కలిగే కష్టనష్టాలను గురించి, వేసవిలో నీటి కొరతవల్ల మనుషులు, పశుపక్ష్యాదులు పడే కష్టాలను గురించి కొందరు శ్రోతలుగా వుండి పోయారు.

పది పదిహేను నిమిషాల తర్వాత అతనికి మెలకువ వచ్చింది.

ప్రభాకర్ రావు అతని ముఖంలోకి చూస్తూ అన్నాడు. "ఏమయ్యా! ఏమయింది? అలా పడిపోయావు?"

"నిన్న ఉదయం నుండి అన్నం తినలేదు. పుణ్యాత్ములెవరైనా కాస్త అన్నం పెట్టి నా ప్రాణాలను రక్షించండి" అక్కడ గుమిగూడిన వారి ముఖాలలోకి దీనంగా చూస్తూ అన్నాడు.

చాలా మంది అతని మాటలను లక్ష్యపెట్టకుండా మెల్లమెల్లగా వెళ్ళిపోయారు. ప్రభాకర్ రావు జాలినిండిన కళ్ళతో అతని వైపు చూస్తూ అన్నాడు. "రా! మా ఇంటికి వెళ్దాం"

ఇద్దరూ ఇంటికి చేరారు.

"అమ్మా! ఈ యనకు కాస్త అన్నం పెట్టవే చాలా ఆకలితో వున్నాడు. నిన్నటి నుంచి అన్నం తినలేదట" ప్రభాకర్ రావు తల్లితో అన్నాడు.

మంచములో కూర్చుండి స్వెట్టర్ అల్లుతున్న మణిమాల అతని వైపు ఆసక్తిగా చూస్తూ అంది "నీ పేరేమిటి బాబూ?"

"ప్రకాశం" చెప్పాడతడు.

మణిమాల క్షణమాలోచించి అల్లుతున్న స్వెట్టర్ టెబుల్ పై పెట్టి వంటింట్లోకి వెళ్ళింది. రెండు నిమిషాల తర్వాత విస్తరిలో అన్నము, అన్నపుకాయకూర పెట్టుకొని ప్రకాశం దగ్గరకు వచ్చింది

విస్తరిలోవున్న అన్నమును, అన్నపుకాయకూరను చూచి చాలా ఆనందించాడు ప్రకాశ్.

ప్రభాకర్ రావు వంటింట్లోకి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి అతని ముందు పెట్టాడు.

ప్రకాశ్ ఆవురావురు మన్నట్టు అన్నం తినేశాడు, విస్తరి పెంటపై పడేసి బావి వద్ద చేయి కడుక్కొని మళ్ళీ వరండాలోకి వచ్చి గ్లాసు స్తంభం దగ్గర బోర్లించి ప్రభాకర్ రావు వైపు చూస్తూ అన్నాడు "మీ మేలు

జన్మలో మరిచి పోలేను ... ఇక వెళ్తానండి ”

“ వెర్రిదువుగానిలే! విశ్రాంతి తీసుకో. నిన్నటి నుండి భోజనం చెయ్యకపోవడానికి కారణం చెప్పావు కాదు. అలా మంచములో కూర్చుండి నీ కథేమిటో చెప్పు ” అన్నాడు ప్రభాకర్ రావు.

ప్రకాశ్ గోడ దగ్గరవున్న ఉలువల బస్తామీద కూర్చుండి చెప్పసాగాడు.

* * *

మా ఊరు పేరు లింగంపల్లి. చాలా చిన్న గ్రామం. మా వూరికి తూర్పుదిశలో మల్లన్నపేట వుంది. మా వూరి పొలాలు మల్లన్నపేట పొలాలు ఒకే కాలువతో పారుతూవుంటాయి.

మూడు సంవత్సరాల క్రితం వర్షాలు తక్కువగా ఉన్నందున మా నీరు ప్రాజెక్టు పూర్తిగా నిండలేదు. మావూరి కొరకు కేటాయించిన నీటిని రాత్రివేళ. మల్లన్నపేట వాళ్ళు కట్టను తెంపి తీసుక వెళ్ళేవారు మల్లన్నపేటవాళ్ళు కట్టను తెంపడం మా వూరివాళ్ళు కట్టపోయడం ఇలా రెండు మూడుసార్లు జరిగింది.

మా వూరి రైతులకు కోపం హెచ్చింది. కట్టతెంపే వారిని పట్టుకోవడానికి కొందరు రైతులు, కొందరు పెద్దరైతుల పాలేర్లు రాత్రివేళ బయలుదేరారు. మా తండ్రి ఓ ధనికుని వ్యవసాయం చేయిస్తుండేవాడు.

అలా వెళ్ళినవాళ్ళు ఓ చోట ఆగి దాగి చూడసాగారు.

మల్లన్నపేట వాళ్ళు కట్ట తెంపడానికి వచ్చారు. ఆ కట్ట తెంపితే నీరంతా మల్లన్నపేట పొలాలవైపు పరుగెత్తుతుంది. మా వూరి వాళ్ళు అడ్డగించారు. వాళ్ళు ఊర్కోలేదు. కట్టతెంపడానికే పూనుకున్నారు. అప్పుడు మావూరి వాళ్ళ సంఖ్య ఎక్కువగా వుండడం వల్ల మల్లన్నపేట వాళ్ళను కొట్టగలిగారు.

మల్లన్నపేటవాళ్ళు అమీనుకు లంచం ఇచ్చి తమవైపు తిప్పుకున్నారని మా వూరివాళ్ళకు తెలిసింది. అయినా మావూరివాళ్ళు భయపడకుండా అడ్డుకట్టను తెంపకుండా చూడడానికి చాలామంది వెళ్ళారు. మల్లన్నపేట వాళ్ళుకట్ట తెంపుతుండగా మావూరి వాళ్ళు అడ్డగించారట. పోలీసులు, అమీను మల్లన్నపేట వాళ్ళ పక్షం చేరి మా వూరివాళ్ళను బెదిరించారట. శాంతి భద్రతలను కాపాడే పోలీసుశాఖలో ఇలాంటి అవినీతిపరులుండడం విచారకరం. మా వూరివాళ్ళు పోలీసువాళ్ళ బెదిరింపులను కూడా లెక్క చేయకుండా కట్టతెంపేవాళ్ళతో ఘర్షణకు దిగారట.

అమీను గాలిలోకి పిస్తోలు పేల్చాడట. అయినా మా వూరివాళ్ళు పారిపోలేదు. ఆ వూరివాళ్ళకు మావూరి వాళ్ళకు పోట్లాటలు ప్రారంభమైంది. అమీను పిస్తోలు పేల్చాటడ. ఆ దెబ్బతో ఒకరైతు నేలకొరిగాడట. అప్పుడు హఠాత్తుగా మా గ్రామస్థులు అమీనును చుట్టుముట్టి కొట్టారట. పోలీసులు పరుగెత్తారట. మా వూరి వాళ్ళు అమీనును రాళ్ళతో కొడుతుండగా మా గ్రామ సర్పంచ్ వద్దని వారించాడట. లేని యెడల ఆరోజు అమీను చనిపోయి వుండేవాడట.

మరుచటిరోజు మా గ్రామానికి రిజర్వుపోలీసు దళం వచ్చింది. చాలామంది మగవాళ్ళు ఎక్కడెక్కడికో పారిపోయారు. పోలీసుల చేతుల్లో చిక్కినవాళ్ళు చావు దెబ్బలు తిన్నారు. పోలీసువాళ్ళు ఇండ్లల్లో చొరబడి ఆడవాళ్ళను కూడా కొట్టారట. అందమైన ఆడవాళ్ళను చెడగొట్టారట కూడా. ఈ విషయాలన్ని వార్తా పత్రికల్లోకి ఎక్కాయి.

మా తల్లిని ఒక పోలీసు బలాత్కరించబోగా ఆమె తప్పించుకొని పారిపోయి బావిలో దూకి చనిపోయింది.

ఇక మా నాన్న చనిపోవడానికి మరో కారణం వుంది.

మా నాన్న యజమాని ఒకనాడు తప్ప త్రాగి వున్నాడు. ఆనాడు నౌకర్ ఏదో చిన్న పొరపాటు చేశాడు. యజమాని తిట్టాడు. నౌకర్ ఎదురు తిరిగి మాట్లాడాడు. యజమాని కోపంతో నౌకర్ వైపు రాయి





మన్నికకు, అహ్లాదానికి...

పంజు టెక్స వారి

* మాస్టర్ * ఫాంటెక్స

ఫైన్ బనియన్లనే వాడండి.

ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు :—

దుర్గా ఏజెన్సీస్ పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

ఎల్లప్పుడూ......
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనీన్లనే
ఉపయోగించండి.

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

విసిరాడు, చంపాలన్న ఉద్దేశంతో అతడా రాయి విసరక పోయినా ఆ దెబ్బతో శేకర్ చనిపోయాడు. లౌక్యం తెలియని అమాయకుడు మా నాన్న. కోర్టులో నిజం చెప్పేశాడు. కాని అతడు డబ్బు వెదజెల్లి కేసును తలక్రిందులు చేయించి తనకు పడబోయే శిక్షనుండి తప్పించుకున్నాడు.

మా నాన్న మీద పగబూనియున్న అతడు యుక్తిగా రహస్యంగా చంపించాడు. నన్నుకూడా చంపించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. నేను గోదావరిఖనికి వెళ్ళిపోయాను. అక్కడ మా దూరపు బంధువు ఒకతను బొగ్గుగనిలో పని చేస్తున్నాడు. నేను అతని ఇంట్లో వుండి ఉద్యోగ ప్రయత్నం చేయసాగాను... ప్రకాశ్ ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"ఆ తర్వాత..." అంది మణిమాల ఒక విషయాన్ని లోతుగా అడిగి తెలుసుకోవడం ఆమెకు అలవాటే.

"వాళ్ళ ఇంట్లో ఓ సంఘటన జరిగింది చెప్తే మీరేమైనా అనుకుంటారేమోనని ఆగాను"

"ఏమీ అనుకోము, చెప్పు" అని ప్రభాకర్ రావు అనడంతో మళ్ళీ చెప్పసాగాడు.

"ఆ మా దూరపు బంధువు పేరు కిష్టయ్య. అతడు మొదటి భార్య చనిపోవడం వల్ల రెండవ పెళ్ళి చేసుకున్నాడు. అతని వయస్సు నలభై పైన. ఆ రెండవ భార్య వయస్సు పందొమ్మిది వుండవచ్చు. కిష్టయ్యకు నల్లమందు తినే అలవాటు వుండేది. అతడు ప్రతిరోజు రాత్రి నల్లమందు మ్రింగి మరీ పడుకునేవాడు.

ఓ రోజు రాత్రి చీకట్లో ఆమె నా దగ్గరకు వచ్చి తన కోరిక తీర్చమని బలాత్కరించింది.

మా తల్లిని బలాత్కరించిన పోలీసువాని మీద నాకెంత కోపం వచ్చిందో నన్ను బలాత్కరించిన ఆ యువతి మీద నాకంత కోపం వచ్చింది. ఆ తర్వాత చెప్పేదేముంది ఆ దేరాత్రి ఇల్లు వదలి బయటకు వచ్చేశాను.

"నువ్వు ఎంతవరకు చదివావు బాబూ!" మణిమాల అడిగింది.

"బి. ఎస్. సి. ఫైనల్ చదువుతుండగా నాన్న చనిపోవటం వల్ల అంతటితో నా చదువు ఆగిపోయింది" చెప్పడం ఆపి కొన్ని క్షణాలు మౌనం వహించి ప్రభాకర్ రావు వైపు. మణిమాలవైపు కృతజ్ఞతా భావంతో చూస్తూ అన్నాడు. "ఇక వెళ్తానండి"

ప్రభాకర్ రావు జేబులోనుండి 5 రూపాయల నోటు దీసి "ఇదిగో ఈ డబ్బు దగ్గర వుంచుకో" అంటూ అందివ్వబోయాడు.

ఏదో ఆలోచిస్తున్న మణిమాల ప్రభాకర్ రావు వైపు తిరిగి "అదేమిటి బాబూ! ప్రకాశం ఇక ముందు మన ఇంట్లోనే వుంటాడు. అతనికి చేతనైన పని చేస్తుంటాడు" అంది.

ప్రకాశ్ ముఖం ఇష్టాన్ని ప్రకటిస్తున్నట్టు వికసించడం మణిమాల దృష్టిని దాటిపోలేదు.

ప్రకాశ్ మణిమాలకు నమస్కరించి అన్నాడు. "ఏ ఆధారం లేని నాకు ఆధారం చూపిస్తున్న మీకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మీరేపని చెప్పినా మీకు సంతృప్తి కలిగించే విధంగా చేయడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు.

"కొంచెం సేపు పడుకొని విశ్రాంతి తీసుకో" అని చెప్పి ప్రభాకర్ రావు వీధిలోకి వెళ్ళిపోయాడు.

♦ ♦ ♦

నాలుగు రోజుల అనంతరం.

వరండాలో తడుకచాటుకు పడుకొన్న ప్రకాశ్‌కు అమ్మాయిల మాటలు, నవ్వులు వినిపించాయి. అతడు లేచి కూర్చున్నాడు.

(సశేషం)

Edited and Published by A. N. Raghavachar, No. 10, Murugesa Mudali Street, Madras-600 001.
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47 & 49, Badrian Street, Madras-600 001.